క్లుప్తంగా

ఎన్‌పీసీఐ సర్వే వేగవంతం చేయాలి

కొల్లిపర: ప్రభుత్వం నిర్వహిస్తున్న హౌసింగ్ సర్వే ఎన్‌పీసీఐ సర్వే సచివాలయం సిబ్బంది వేగవంతం చేయాలని తెనాలి డీఎల్‌డీఓ పద్మజ అన్నారు. శనివారం మండల కేంద్ర మైన కొల్లిపరలో గ్రామ సచివాలయం ఒకటి, మూడు సచివాలయంలో ఎంపీడీవో వి.విజయలక్ష్మితో కలసి ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తొలుత ఆమె సచివాలయంలో జి ఈ ఓ కోఆర్డినేట్ ఆఫ్ హౌసింగ్ సర్వే ఎన్‌పీసీఐ సర్వే ఏ విధంగా జరుగుతుంది అన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే ఉన్నత అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారుసర్వేలో వస్తున్న సమస్యల గురించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయం కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం



లక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఎంపిక చేసినట్లు జరిగిందని జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాచకొండ జాన్‌బాబు, తూర్పు ఇన్‌చార్జిగా షేక్ మస్తాన్‌వలి, తెనాలి ఇన్‌చార్జిగా చందు సాంబశివుడు, పొన్నూరు ఇన్‌చార్జిగా గాదె నాగేశ్వరరావు, మంగళగిరి ఇన్‌చార్జిగా షేక్ సలీం, తాడికొండ ఇన్‌చార్జిగా చిలకా విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా కొరివి వినయ్‌కుమార్‌లను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి శ్రీపతి ప్రకాశం, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్లా సునీల్, గద్దం పాల్ విజయ్ కుమార్ పీసీసీ ప్రధాన కార్యదర్శి బొట్ల బ్రహ్మయ్య రాహుల్, యూత్ అధ్యక్షులు మల్లెల మోషే పాల్గొన్నారు.

షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోండి



తెనాలిఅర్బన్: హెచ్‌ఐవీతో బాధపడే వారు తప్పని సరిగా షుగర్, బీపీ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అంకినీడు ప్రసాద్ సూచించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, షేర్ ఇండియా సహకారంతో ఏఆర్‌టీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీపీ, షుగర్ పరీక్షల కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంలో క్యాన్సర్; బీపీ, షుగర్ పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ జ్యోతులు వీరాస్వామి, ఏఆర్‌టీ సెంటల్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహ, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్నకుమార్, డేటా మేనేజర్ శ్రీకాంత్, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్ గోతులు పూడ్చాలి



తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని పాత బస్టాండ్ నుండి చెంచుపేట వైపు వెళ్లే ఓవర్ బ్రిడ్జిని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఓవర్ బ్రిడ్జిపై పాదచారులు వెళ్లే ఫుట్‌పాత్‌పై గోతులు ఉండడాన్ని గమనించిన సభ్యులు తక్షణమే గోతులకు మరమ్మతులు చేయాలని రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. గోతుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే చినరావూరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ప్లాట్‌ఫాం ఎత్తు సరిగాలేదని, ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ప్లాట్‌ఫాంల మీద ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చినప్పుడు పేరు భోగీ నంబరు కనబడేలా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దరిశి శివకోటేశ్వరరావు, అబ్దుల్ ఆరిఫ్, రావూరి శివ శంకర్‌రావు, నారాయణం కమల్ కుమార్, సాతులూరి రాజేష్, అబ్రహం లింకన్, లకరాజు చిరంజీవి ,కటారి వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వికాసంలో ప్రముఖుల పాత్ర అపారం

గ్రంథాలయ పితామహుల సంస్మరణలో వక్తలు

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయం ఉద్యమ ప్రముఖుల సంస్మరణను నిర్వహించారు. ఆలపాటి కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, విశ్రాంత గ్రంథపాలకుడు మొవ్వా సుబ్బారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం, కోదాటి నారాయణరావు, గ్రంథాలయశాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. గ్రంథాలయ రంగానికి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. చదువరులు, పోటీపరీక్షల విద్యార్థులు, గ్రంథాలయ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలను జరిపారు. గ్రంథాలయాధికారి కావూరి రమాదేవి పర్యవేక్షించారు.

సంగం జాగర్లమూడిలో వక్తృత్వ పోటీలు

రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో మూడో రోజైన శనివారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ కాలేషా, కె.శాంతి గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులను గురించి వివరాలను తెలియజేశారు. పాఠశాల బాల బాలికలకు గ్రంథాలయాలు-ఉపయోగాలు, సీనియర్స్‌కు సమాజంపై సోషల్ మీడియా ప్రభావం అంశాలపై వక్తృత్వ పోటీలు జరిపారు. న్యాయ నిర్ణేతలుగా స్కూల్ అసిస్టెంట్స్ కె.శ్రీవల్లి, కె.సుజాత వ్యవహరించారు. గ్రంథాలయాధికారి జె.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



తెనాలిలో గ్రంథాలయ ప్రముఖులకు పుష్పాంజలి



పెదరావూరులో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరత్నమ్మ

పెదరావూరులో..

రూరల్ మండలం పెదరావూరులోని శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరత్నమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులు డాక్టర్ అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు, విశ్రాంత గ్రంథాలయ అధికారి కె.చంద్రమౌళి గ్రంథాలయ అధికారి ఎ.రాఘవేంద్రరావు, శాఖమూరి తిమ్మానాయుడు పాల్గొన్నారు.



సంగంజాగర్లమూడిలో మాట్లాడుతున్న కాలేషా

జిల్లావైద్యశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగి బొమ్మదేవర వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం జిల్లా వైద్యశాల ఆవరణలోని తల్లిపిల్లల వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎనిమిది ఏసీలను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా కొంత వెనుకబడి ఉందని, పేద ప్రజలకు అవసరమైన వసతులను కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నన్నపనేని ప్రతాప్ సహకారంతో క్యాజువాలిటీని త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. బొమ్మదేవర దుర్గాను ఆయన సన్మానించారు. అనంతరం క్యాజువాలిటీని పరిశీలించిరు. అక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఆసుపత్రి ఆవరణలోని మురుగు కాల్వలను బాగు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ నన్నపనేని ప్రతాప్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, డాక్టర్ జె.హనుమంతరావు, ఆర్ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావు, పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేద ప్రజల్లో సంతోషాన్ని నింపేందుకు ..

తెనాలిఅర్బన్: పేద ప్రజల్లో సంతోషాన్ని నింపేందుకు దీపం పథకం-2 ద్వారా ఉచితంగా గ్యాస్ సిలెండర్‌ను పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని రాజేశ్వరికి గ్యాస్ సిలెండర్‌ను శనివారం సాయంత్రం ఆయన దీపం పథకం-2 కింద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1.55 కోట్ల మంది గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయని, వారిలో అర్హులైన వారందరికీ ఉచితంగా గ్యాస్ సిలెండర్‌లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పథకం ప్రవేశపెట్టి తర్వాత ఇప్పటి వరకు 28 లక్షల మంది గ్యాస్‌ను బుక్ చేసుకున్నారని, వారిలో 19 లక్షల మందికి సిలెండర్‌ను డెలివరీ చేసినట్లు చెప్పారు. దీని కోసం రూ.148 కోట్ల నిధులను వెచ్చించినట్లు చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దీనిని రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్యాస్ సిలెండర్ డెలివరి చేసిన 48 గంటల లోపు లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మ, తహసీల్దార్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఎస్పీ జనార్ధనరావు, టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



ఏసీలను ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, ప్రక్కన దాతలు

రాబోయే పదేళ్లలో కృత్రిమమేథదే ఆధిపత్యం

పావులూరి ట్రస్ట్ సభలో విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

తెనాలి: రాబోయే పదేళ్లలో శాస్త్రసాంకేతికతలో ఊహించలేని మార్పులతో ప్రపంచంలో కృత్రిమ మేధ రాజ్యమేలుతుందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య చెప్పారు. నేటితరం ఆ సాంకేతికతను అంది పుచ్చుకోవాలని సూచించారు. పావులూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్‌లో గల ఏవీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటరులో ఏర్పాటైన సభకు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి-ముకుందరావు దంపతులకు ఆదర్శ దంపతుల పురస్కారాన్ని డాక్టర్ లావు రత్తయ్య చేతులమీదుగా ప్రదానం చేశారు. సభలో డాక్టర్ రత్తయ్య తన మాట్లాడుతూ, కృత్రిమ మేధతో అన్ని రంగాల్లో మనుషులతో పనిలేకుండా తగిన సేవలను పొందవచ్చని చెప్పారు. ఆ ప్రపంచంలో భావోద్వేగాలకు, నైతికతకు స్థానం ఉండదనీ, ప్రస్తుత విద్యార్థులు ఆ సాంకేతికతోపాటు మనవైన విలువలను కలిగివుంటే సమాజానికి ప్రయోజనకరమన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు ఇవ్వకున్నా విలువలను నేర్పాలనీ, ఉపాధ్యాయులు వాటిని అలవరచాలని సూచించారు. పెద్దగా విద్యాగంధం లేకున్నా రాజకీయ రంగంలో ఎదిగిన నన్నపనేని రాజకుమారిని యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు 'తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు' అనే అంశంపై మాట్లాడారు. సభాధ్యక్షుడు డాక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ, కాలేజి రోజుల్లో ముకుందరావు తనకు గురువనీ, విద్యాభ్యాసం తర్వాత తనకు తొలిగా ఉద్యోగం ఇచ్చింది డాక్టర్ రత్తయ్యగా చెబుతూ వారికి పాదాభివందనం చేశారు. పావులూరి ట్రస్ట్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులను చూసిన ఆవేదనతో 17 ఏళ్ల క్రితం ట్రస్ట్‌ను నెలకొల్పి తల్లిదండ్రుల ప్రాధాన్యతను తెలియజెబుతూ, ఆదర్శ దంపతులను సత్కరిస్తున్నట్టు వివరించారు. వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, పావులూరి భానుమూర్తి, వివేక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గుత్తా వెంకటరత్నం, డాక్టర్ కె.రామరాజు మాట్లాడారు.



రాజకుమారి-ముకుందరావు దంపతులకు పురస్కారం అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

ప్రముఖ పిల్లల మనోవైద్య నిపుణురాలు కిరణ్మయి చౌదరి

తెనాలి: పిల్లల ఆరోగ్యకర పెరుగుదల, మానసిక వికాసానికి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పిల్లల మనోవైద్య నిపుణురాలు కిరణ్మయి చౌదరి సూచించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని వెస్ట్‌బెర్రీ స్కూలులో శనివారం 'ది పవర్ ఆఫ్ పేరెంటింగ్: టూల్స్ ఫర్ సక్సెస్' అంశంపై కిరణ్మయి చౌదరి ప్రసంగించారు. నర్సరీ నుండి అయిదోతరగతి విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల పెంపకం, ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలతో మెలగాల్సిన విధానాన్ని ఆమె వివరించారు. సమావేశంలో పాల్గొన్న దాదాపు 400 మంది తల్లిదండ్రులకు పిల్లలతో ఏవిధంగా సంభాషణ ఉండాలి? పిల్లల్లో విద్యా ఒత్తిడిని తగ్గించేందుకు అనుకూల వాతావరణం ఏ విధంగా సృష్టించాలి? సామాజిక మాధ్యమాల వినియోగాన్ని, దాని సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల్లో ఆరోగ్యకరమైన పెరుగుదల, మానసిక వికాసానికి, రోగ నిరోధక శక్తి కోసం ఎటువంటి ఆహారం ఇవ్వాలనేది చెప్పారు. పిల్లల్లో బాధ్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి తగినవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రులలో ఉత్తమమైన పద్ధతులను ఆవిష్కరించడానికి పిల్లలతో బలమైన బంధాలు ఏర్పాటుకు సమావేశం దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయుడు టీవీ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ప్రాథమిక ప్రధానోపాధ్యాయిని జ్యోతి, పరిపాలనాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్మయి చౌదరి

సహజీవనం కొనసాగించకుంటే చంపేస్తా

- వివాహితను వేధిస్తున్న ప్రియుడు
- బాధితురాలి తండ్రి గొంతుపై కాలితో తొక్కి దారుణం

తెనాలి రూరల్: తనతో సహజీవనం కొనసాగించకుంటే చంపేస్తానని వివాహితను ప్రియుడు బెదిరిస్తున్నాడు. అంతటితో ఆగకుండా మంచాన పడి ఉన్న ఆమె తండ్రి గొంతుపై కాలితో తొక్కి తన కర్కశాన్ని చాటాడు. ఆమె ఇంట్లోని సామగ్రి విసిరేయడమే కాకుండా దుస్తులనూ తగులబెట్టాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి బాధిత మహిళ కథనం మేరకు వివరాలు... వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన చావలి శాంతిశ్రీ గతంలో చేబ్రోలు మండలం శేకూరుకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. విభేదాల కారణంగా భర్తతో విడిపోయింది. ఏడాది క్రితం పట్టణ ఐతానగర్‌కు చెందిన మాతంగి నవీన్ పరిచయమయ్యాడు. కొంత కాలం సహజీవనం చేశారు. నవీన్ తీరు నచ్చక కొన్నాళ్లుగా దూరం పెడుతోంది. మండలంలోని సంగంజాగర్లమూడిలో అద్దె ఇంట్లో ఉంటున్న ఆమెతో అటు మంచానికే పరిమితమైన తండ్రి ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం శాంతిశ్రీ లేనప్పుడు ఇంటికి వెళ్లిన నవీన్ ఆమె తండ్రి గొంతుపై కాలు వేసి తొక్కాడు. పైశాచికంగా దాన్ని వీడియో తీసి ఆమెకు పంపాడు. ఇంట్లోని వస్తువులన్నీ విసిరేసి ఆమె దుస్తులను తగులబెట్టాడు. బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్న ఆమెకి ఫోన్ చేసి 'ఎక్కడ ఉన్నావో చెప్పు.. వచ్చి చంపేస్తానంటూ' బెదిరిస్తున్నాడు. బాధితురాలు రూరల్ పోలీసులను ఆశ్రయించింది. విషయం తెలుసుకున్న నిందితుడు పరారయ్యాడు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు వృద్ధుల దంత సమస్యలపై అవగాహన

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సమావేశంలో ప్రముఖ దంత వైద్యురాలు, 'ఇంప్లాంటాలజి' నిపుణురాలు డాక్టర్ హిమబిందు ఓగిరాలతో అవగాహన కార్యక్రమం జరగనుంది. 'వృద్ధులు- దంత సమస్యలు-నివారణ' అంశంపై డాక్టర్ హిమబిందు మాట్లాడతారని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం, కార్యదర్శి కడియాల రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం సందర్భంగా యుఎస్‌వీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యతో షుగరు పేషెంట్లకు 'హెచ్‌బీఏవన్‌సీ' (మూడు నెలల సగటు పరీక్ష) నిర్వహిస్తారని వివరించారు.

వైభవంగా శోభాయాత్ర

తెనాలిరూరల్: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి శనివారం సాయంత్రం 1008 మంది మహిళలతో కృత్తికా దీపజ్యోతి శోభయాత్ర ఎంతో వైభవంగా సాగింది. హిందువుల ఐక్యతను చాటుతూ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు పుట్టా శేషు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శోభాయాత్ర అనంతరం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం లో లక్కీడిప్ ద్వారా ఎంపికైన మహిళలకు విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి పసుపు కుంకుమ చీరలు బహూకరించారు.

బైక్‌ను సీజ్ చేయించిన న్యాయమూర్తి

తెనాలిరూరల్: నంబరు ప్లేటుపై వాహన రిజిస్ట్రేషన్ నంబరు బదులు సినీ, రాజకీయ నాయకులు ఫోటోలు పెట్టడం, వారి తాలూకా అంటూ రాయించి ఉంచుతుండడాన్ని హైకోర్టు న్యాయవాది పెరికల డేనియేల్ ప్రి లిటిగేషన్ కేసు వేశారు. దీనిపై విచారించిన మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్‌ఓ బైక్‌ను సీజ్ చేయించారని న్యాయవాది శనివారం తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై తాను వేసిన ప్రి లిటిగేషన్ కేసు విచారణకు రావడంతో న్యాయమూర్తి బైక్‌ను సీజ్ చేయించి తదుపరి చర్యల కోసం ఆర్టీవో అధికారులకు అప్పగించినట్టు వివరించారు. ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం, లారీలు, ట్రాక్టర్లు అధిక లోడుతో వెళుతుండడం, మైనర్లు వాహనాలు నడపడం, చంటి పాపలతో భిక్షాటన చేయడం వంటి అంశాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారని తెలిపారు.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ప్రోత్సహించండి



తెనాలిఅర్బన్: సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయాలు, ఆకుకూరలు తీసుకోవడం వలన మనిషి ఆరోగ్యంగా జీవిస్తారని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే నినాదంతో నెహ్రూనికేత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలు వాడి పండించిన ఆహా పదార్థాలను తీసుకోవడం అనర్థాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతా కాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటికి నల్ల రిబ్బన్లతో కార్మికుల నిరసన

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సి మెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన కొనసాగుతోంది. శనివారం కార్మికులు నోటికి నల్ల రిబ్బ న్లు ధరించి, దీక్ష కొనసాగించారు. తమ నిరసనను వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ యాజమా న్యం నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదని, కార్మికులు అర్ధాకలితో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుంటే యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. స్టీవెన్, ఆశీర్వాదనం, యెహోషువా, ఇశ్రాయిల్, సాంబయ్య, నవనీతం, ఎం. సామ్రాజ్యం, శారద సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

మంగళగిరి: ప్రభుత్వంలో జరుగుతున్న మంచి, చెడులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని ఫంక్షన్ హాలులో శనివారం సీనియర్ జర్నలిస్టు ఈపూరి రాజారత్నం రచించిన జర్నలిజం.. జర్నలిస్టులు అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిజంలో బేసిక్స్ తెలుసుకోవడానికి పుస్తకం దోహదపడుతుందన్నారు. ఎప్పుడైతే జర్నలిస్టు నిజాయితీతో చిత్తశుద్ధితో పని చేస్తాడో అప్పుడే ప్రజాస్వామ్యం పది కాలాలపాటు మనగలుగుతుందన్నారు. రచయిత ఈపూరి రాజారత్నం, లోకం చెప్పని నిజం ఎడిటర్ ఎస్‌కే రఫీ, టీడీపీ నాయకుడు మల్లవరపు వెంకట్, టీవీ 18 డైరెక్టర్ ఈపూరి శేషగిరి పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో జరుగుతున్న హౌస్ హోల్డ్ జియో కో-ఆర్డినేట్స్ సర్వేకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 28వ వార్డులో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి తమ సిబ్బంది వచ్చి వివరాలు సేకరించి వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరచడం చేస్తున్నారని చెప్పారు. ఇలా చేయడం వలన ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక ఈజీగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: రోడ్ల వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 1,2, 39 వార్డులలో శనివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సుజుకి డిజైర్ కారు ఆవిష్కరణ

తెనాలిరూరల్: పట్టణ సుల్తానాబాద్‌లోని జయలక్ష్మి ఆటోమోటీవ్స్‌లో నూతన సుజుకి డిజైర్ కారును శనివారం ఆవిష్కరించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జగదీష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కారును ఆవిష్కరించారు. బ్రాంచ్ మనేజర్ సుంకర నరేష్, జి. శ్రీనివాస్, జమ్మి సతీష్, భాను, శ్వేత, మణికంత పర్యవేక్షించారు.